


# మువ్వల పట్టీలు

**ఉదయం ఏడుగంటలు. కిటికీలోనుండి సూర్యుని ఉదయకిరణాలు ముఖంపై పడడంతో సుభద్రమ్మ గుబుక్కున కళ్ళుతెరిచి చూసి "అమ్మో! బాగా పొద్దెక్కినట్టుంది. ఇంత మొద్దునిద్ర పట్టిందేమిటి ఇవాళ" అనుకుంది. మంచంలో లేచికూర్చుని వదులైపోయిన జుట్టుముడిని విప్పి వేళ్ళతో తలదువ్వుకుని మళ్ళీ ముడివేసుకుంటూ లేచింది. ఇంతలో "ఘల్... ఘల్... ఘల్" కిటికీ అవతల నుండి కాలిమువ్వల చప్పుడు వినిపిస్తుంటే చిన్నపిల్లలా హుషారుగా లేచి ఆత్రంగా కిటికీ నుండి బయటకు చూసింది.**

ఆ అమ్మాయికి పదిహేడేళ్ళుంటాయేమో. ఛామనఛాయగా ఉన్నా ముఖం కళగా ఉంది. కొత్తగా పెళ్ళి అయినట్టుంది. మెడలో పసుపుతాడు, నల్లపూసలు కనిపిస్తున్నాయి. చేతులకు ఆకుపచ్చ మట్టిగాజులున్నాయి. ఆపిల్లను పైనుండి కిందివరకు పరీక్షిస్తున్న సుభద్రమ్మ చూపులు పాదాల దగ్గర నిలిచిపోయాయి. కారణం ఆమె పాదాలకున్న లావుపాటి మామిడిపిందెల పట్టీలు. మధ్యమధ్యలో మువ్వల గుత్తులతో పట్టీలు కాస్త మోటు గా ఉన్నా సుభద్రమ్మకు మాత్రం అవి నచ్చాయి. ఆ పిల్ల చీపురుతో ఊడుస్తున్నంతసేపు ఆమె కళ్లు ఆ పిల్ల పాదాలనే చూస్తున్నాయి.

"గేటు బైట కూడా ఊడ్వమంటారా అమ్మా!" ఆపిల్ల గట్టిగా అడగడంతో ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చింది. ఇంతలో కోడలు బయటకు వచ్చి "ఊడవాలికదా. లేకపోతే ఎట్లా ఉంటుంది అసహ్యంగా. గేటుముందు కూడా ఊడ్చి, నీళ్ళుజల్లి ముగ్గుపెట్టు" అంది.

తర్వాత కోడలు లోపలకు వచ్చి "లేచారా అత్తయ్యా" ఇవాళ ఇంతసేపు పడుకున్నారేంటి? ఒంట్లో బాగాలేదా" అంది.

"అబ్బే, అదేంలేదమ్మా. ఎందుకో మొద్దునిద్ర పట్టేసింది. వస్తున్నానుపద" అని బయటకు నడిచింది. ముఖం కడుక్కొని కోడలు ఇచ్చిన టీగ్లాసు తీసుకుంటూ "వసంతా! ఆ అమ్మాయి కొత్త పని మనిషా. ఇంతకుముందు చూసినట్టు లేదే" అంది.

"మన రాజమ్మ కోడలు. పోయిన నెలలోనే కొడుక్కి పెళ్ళిచేసింది. గదా రాజమ్మ. ఆమెకి నిన్నటి నుండి జ్వరంగా ఉందట. అందుకని ఇవాళ కోడల్ని పంపించింది" అంటూ కూరలు తరగడంలో నిమగ్నమయింది కోడలు.

ఆరోజు నుండి పదిరోజుల వరకు రాజమ్మకు జ్వరం తగ్గకపోవడంతో ఆ అమ్మాయే పన్లోకి వచ్చింది. ఆ పిల్ల అటూఇటూ తిరుగుతూ పనిచేస్తుంతసేపు బయట అరుగుపైన కూర్చుని ఆమె పాదాల వైపు చూస్తూ ఉండడం సుభద్రమ్మ దినచర్యలో ఒక భాగవైపోయింది. పనిపిల్ల రాగానే ఆత్రంగా బయటకు వచ్చి చూసే అత్తగారిని చూసి వసంత ఆశ్చర్యపోయింది. "ఏంటో, ఈ విడ ఆ పిల్ల పనిచేస్తున్నంతసేపు చూస్తూనే ఉంటుంది. ముసలాళ్ళు చేసే పనులకు అర్థంపర్థం ఉండదు కదా" అనుకుంది. కూతురు సమీరతో కూడా అదేమాట అంది.

సమీర ఒకరోజు "బామ్మా! ఆ అమ్మాయి నీకు బాగా నచ్చిందా! ఎందుకు ఆమె వైపు అలా చూస్తూ ఉంటావు. పోనీ ఆమెతో ఏదైనా మాట్లాడతావా అంటే అదీలేదు. ఊరికే చూస్తూ కూర్చుంటావు. పాపం ఆ అమ్మాయికి ఇబ్బందిగా ఉంటుందికదా" అంది.

సుభద్రమ్మ మనమరాలు మాటలకు బిత్తరపోయి ఏంచెప్పాలో తెలియక "ఆమె కాళ్ళ పట్టీలు చేసే శబ్దం బావుంటుందే. అందుకే అదివింటూ ఇక్కడే కూర్చుంటాను. నిన్ను పెట్టుకోమంటే మువ్వల పట్టీలు పెట్టుకోవైతివి" అంది. మనుమరాలు నవ్వి "ఇప్పుడు పెట్టుకోవడం ఫ్యాషన్ కాదు బామ్మా! పెట్టుకుంటే కాలేజీలో అందరూ నవ్వుతారు" అంటూ వెళ్ళిపోయింది. ఆ తర్వాత రాజమ్మ జ్వరం తగ్గి పన్లోకి రావడంతో సుభద్రమ్మ దిగులుపడింది.

వసంత మేనకోడలి పెళ్ళి కుదిరింది. షాపింగ్ కోసం ఊరి నుండి ఆమె అన్నయ్య, వదిన, మేనకోడలు అందరూ వచ్చారు. మూడురోజులు వసంతతో కలిసివెళ్ళి వాళ్ళకు కావలసినవన్నీ కొన్నారు. ఆరోజు వాళ్ళు తిరిగి ఊరికి వెళ్తుంటే వసంత పెళ్ళికూతురికి కొన్న నగలు అత్త గారికి తెచ్చి చూపించింది. డైమెండ్స్ సెట్, చంద్రహారం, రాళ్ళగాజులు అన్నీ చూస్తూ చివరన వెండిపట్టీల పైన ఆమె దృష్టి నిలిచిపోయింది. మరీ సన్నమూ, లావుకాని పట్టీలకు మూడేమూడు మువ్వల గుత్తులున్నాయి. "నాజూగ్గా చాలా బావున్నాయి పట్టీలు" అనుకుంది సుభద్రమ్మ పట్టుకుని చూస్తూ, ఇంతలో వసంతను ఎవరో పిలవడంతో "మీరు చూస్తూండండి అత్తయ్యా! నేను మళ్ళీ వచ్చి తీసుకెళ్తాను" అంటూ బయటకు వెళ్ళిపోయింది.

సుభద్రమ్మ పట్టీలను ఆప్యాయంగా పట్టుకుని కూర్చుంది. గదిలో ఎవరూ లేరు. తనొక్కతే ఉంది. అందరూ హాల్లో

డా. కె.పద్మలత

కూర్చుని పెళ్ళి చీరలు చూస్తున్నట్టున్నారు. ఆమెకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. "ఊహూం, పెళ్ళికూతురివి తనెలా పెట్టుకుంటుంది. బావుండదు" అని మళ్ళీ అనుకుంది. కాని ఒక్కసారైనా కాళ్ళపై పెట్టి చూడాలని మనసు లాగుతోంది. మంచంపై కూర్చుని వణుకుతున్న చేతులతో పట్టీలను పాదాలవైపు తెచ్చింది.

అంతలో తలుపు తోసుకుంటూ సమీర లోపలికొచ్చింది. సుభద్రమ్మ ఉలిక్కిపడి పట్టీలను తీసి చేతిలో పట్టుకుంది. సమీర బామ్మను, ఆమె చేతిలోని పట్టీలను మార్చిమార్చి చూసింది. బామ్మ ముఖం పాలిపోవడం, ఆమె తప్పు చేసినట్టుగా ఫీలవుతూ ఉండడం ఆమె గమనించింది. "బామ్మా! అమ్మ నగలు తీసుకురమ్మంది" అంటూ నగలన్నీ తీసుకుని వెళ్ళిపోయింది.

సుభద్రమ్మ మనసులో దిగులు పేరుకుంది. మనుమరాలు తన గురించి ఏమనుకుందో ఏమో. అయినా, ఈ వయసులో తనకు మువ్వలపట్టీల కోరికేంటి అనుకుంది.

బంధువులందరూ వెళ్ళిపోయారు. రాత్రి భోజనం చేసి అందరూ పడుకున్నారు. సుభద్రమ్మకు నిద్ర రావట్లేదు. ఎవరో తలుపు తడుతున్నారు. లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా సమీర. "బామ్మా! నాకు నిద్ర రావట్లేదు. కాస్సేపు నీతో కబుర్లు చెప్పాలని వచ్చాను" అంటూ లోపలికి వచ్చి మంచంపై కూర్చుంది. సుభద్రమ్మ నవ్వింది. కాని మనసులో ఏమూలో అనుమానం.

సమీర హఠాత్తుగా "బామ్మా! నేనంటే నీకిష్టమేనా" అని అడిగింది ఆమె ముఖంలోకి చూస్తూ.

"అదేంటే, పిచ్చి ప్రశ్న. నువ్వుకాక ఇంకెవరంటే నాకిష్టం ఉంటుంది. నువ్వు నా బంగారు తల్లివికదా" అంది ఆమె తల నిమురుతూ.

"అయితే మనిద్దరం ఇవాళ మనసు విప్పి మాట్లాడుకుందామా బామ్మా" అంది సమీర.

"ఏంటే, కొంపదీసి ఎవరినైనా ప్రేమించావా" భయంగా అడిగింది.

"అబ్బా! అదేంలేదు బామ్మా! అయినా మనం మాట్లాడుకోవలసింది నాగురించి కాదు, నీగురించే" అంది.

"నా గురించి ఏమున్నాయి మాట్లాడడానికి. మీరందరూ నన్ను బాగానే చూసుకుంటున్నారు కదా"

"ఊహు... అదికాదు" అని ఒక్కక్షణం ఆగి "బామ్మా! నీకు మువ్వల పట్టీలంటే ఇష్టమా?" అడిగింది,

సుభద్రమ్మకు ఏం చెప్పాలో తెలియక ఔనని తలాడించింది.

"మరి కొనుక్కొని పెట్టుకోవచ్చుగా"

"ఇప్పుడా? ఈ వయస్సులోనా రాలిపోవడానికి సిద్ధంగా ఉన్నాను" నవ్వుకుంటూ అంది.

"పట్టీలకు వయసుతో సంబంధమేంటి బామ్మా! అయినా ఇన్నేళ్ళలో నువ్వెప్పుడూ మువ్వలపట్టీలు పెట్టుకోలేదా?" కుతూహలంగా అడిగింది.

సుభద్రమ్మ విచారంగా 'లేదని' తలాడించింది. ఆమెకు మనుమరాలు తను పట్టీలు పెట్టుకోవడానికి ప్రయత్నించడం చూసిందన్న విషయం అర్థమైపోయింది. అందుకే, "మీరా! ఇన్ని రోజుల నుండి నా ఇష్టాలను, కోరికలను ఎవరి ముందు బయట పెట్టలేదు. ఇవాళ నువ్వు అడుగుతున్నావు, అందుకని చెప్పాలనుకుంటున్నాను. నీకు ఓపిక ఉంటే నా కథ చెప్తాను వింటావా?" అని అడిగింది గంభీరంగా.

సమీర ఆశ్చర్యంగా చూసి, "చెప్పు బామ్మా! అందుకేగా నీ దగ్గరకు వచ్చింది" అంది.

"నిద్రవస్తే చెప్పు. రేపు మాట్లాడు

కుందాం"

"లేదు లేదు. నిద్ర రావట్లేదు. వినాలని ఉంది బామ్మా! తొందరగా చెప్పు" ఆత్రుతగా అడిగింది. సుభద్రమ్మ గంభీరంగా కూర్చుంది. ఆమె మనసు గతం వైపు పరుగుతీసింది.


సుభద్రమ్మ పుట్టింది, పెరిగింది ఒక పల్లెటూళ్ళో. ఆమెకు అయిదేళ్ళ వయసులో తల్లికి జబ్బుచేసి, ఆ పల్లెటూళ్ళో సరైన వైద్యం అందక చనిపోయింది. సంవత్సరం తిరగకుండానే తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. సుభద్రమ్మ పిన్ని మంచిదేకాని మాట కఠినంగా ఉండేది. అందరూ తను చెప్పినట్టే వినాలనుకునేది. సుభద్రమ్మకు ఎనిమిదేళ్ళ వయసులో స్నేహితురాలి కాళ్ళకు మువ్వల పట్టాలు చూసి ముచ్చటవడింది. ఆమె నడుస్తుంటే ఘల్లుఘల్లుమని శబ్దం వస్తుంటే విచిత్రంగా చూసింది. తనకూ అట్లాంటివి ఉంటే బావుండుననుకుంది. పిన్ని నడగాలంటే భయం. అందుకే ఒకరోజు తండ్రితో మువ్వలపట్టీలు కావాలని అడిగింది. అతడు భార్యను పిలిచి, "ఇదేదో పట్టీలు కావాలంటోంది. వీలైతే చేయించరాదు" అన్నాడు.

అప్పటికే ఒక ఆడపిల్లకు తల్లి అయిన ఆమె "చేయిస్తే ఇద్దరు పిల్లలకు చేయించాలి కదా. తర్వాత చూద్దాంలెండి" అని కొట్టిపడేసింది. తననడగకుండా, ఆ పిల్ల తండ్రిని వెళ్ళి అడగడం ఆమెకు కోపం తెప్పించింది. "నీకేమైనా కావలిస్తే, నన్నే అడుగు. మీ నాన్నగారిని అడగడానికి వీల్లేదు. అర్థమైందా" గద్దించినట్టు అంది. ఆ పిల్ల బిక్కమొహంతో "అలాగే" అన్నట్టు తలాడించింది. ఆ తర్వాత మళ్ళీ మువ్వల పట్టీల గురించి అడిగే సాహ సం ఆమె చేయలేదు. కాని, అవి కావాలన్న కోరిక ఆమెతో పాటే మనసులో పెరు గుతూ వచ్చింది.

ఆమెకు పదమూడేళ్ళ వయసులో పిన్ని ఒక సంబంధం చూసి పెళ్ళిచేయాలని నిశ్చయించింది. వరుడికి ఇరవై ఆరు సంవత్సరాలు. అప్పటికే పెళ్ళయి ఇద్ద రు పిల్లలున్నారు. కాని, భార్య చనిపోవడంతో మళ్ళీ పెళ్ళికి సిద్ధపడ్డాడు. అతనికి కొన్ని వ్యసనాలున్నాయని తెలిసి తండ్రి ఇష్టపడలేదు. కాని, పెళ్ళయితే అతడే మారతాడని చెప్పి పిన్ని పెళ్ళికి ఒప్పించింది. వరుడి గురించి, అతని మంచి చెడ్డల గురించి సుభద్రమ్మ పెద్దగా ఆలోచించలేకపోయింది. పిన్నివచ్చి "పెళ్ళిలో వాళ్ళు నీకు బోలెడు నగలు పెడతారే. నువ్వెంతయినా అదృష్టవంతురాలివే" అంది. సుభద్రమ్మ గబుక్కున "పిన్నీ! వాళ్ళు నాకు వెండి మువ్వల పట్టీలు పెడతారా?" అని అడిగింది.

"ఓసి పిచ్చిదానా! వాళ్ళు బోలెడు బంగారం పెడుతుంటే, వెండిపట్టీల గురించి ఆలోచిస్తావేమే. పెళ్ళైతే మీ ఆయన బంగారు పట్టీలే కొనిస్తాడులే" అని నవ్వుతూ వెళ్ళిపోయింది. పెళ్ళిలో వరుడి వైపువాళ్ళు బంగారు నగలు పెట్టారు. కాని వెండి పట్టీలు మాత్రం పెట్టలేదు. అలా పెళ్ళిలో కూడా ఆమె కోరిక తీరలేదు.

కాపురానికి వచ్చిన కొద్దిరోజులకే సుభద్రమ్మకు భర్త గురించి అర్థమైపోయింది. అతడు రోజూ తాగి ఏ రాత్రికో ఇల్లు చేరడం, తనపై ప్రేమ చూపించకపోవడం, పిల్లలను కూడా సరిగా పట్టించుకోకపోవడం ఆమెను బాధపెట్టింది. సహజంగా భయస్తురాలు కావడంతో ఏమీ చేయలేకపోయింది. ఒకరోజు బాగా తాగి నడవలేక చెట్ల మధ్య పడిపోయిన అతన్ని పాము కరిచి నురుగు కక్కుకొని చనిపోయాడు. అలా దురదృష్టం మరోసారి ఆమెను వెంటాడింది. తండ్రివచ్చి పుట్టింట్లో శాశ్వతంగా ఉండడానికి పిలిచినా, ఆమె వెళ్ళడానికి ఒప్పుకోలేదు. "అక్కడ పిన్నితో బాధలుపడే కన్నా ఇక్కడే ఉండి "అమ్మా" అని పిలుస్తున్న ఈ అమాయకపు పిల్లలను పెంచడమే మంచిది. వాళ్ళను తను అనాథలను చేయలేదు" అనుకుంది.



ఆ తర్వాత ఊర్లో రెండెకరాల భూమి ఉంచుకొని, మిగతావన్నీ అమ్మి పట్నంలో మూడు పోర్షన్ల ఇల్లు కట్టి, ఒక దాంట్లో తాము ఉంటూ, మిగతా రెండు పోర్షన్లపై వచ్చే అద్దెతో పిల్లలను పోషిస్తూ కాలం వెళ్ళదీసింది. పిల్లలు కూడా బుద్ధిగానే చదువుకున్నారు. అబ్బాయి పి.జి.చేసి బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకొని పెళ్ళి చేసుకొని స్థిరపడ్డాడు. అమ్మాయికి కూడా మంచి సంబంధం చూసి పెళ్ళిచేసింది.

సుభద్రమ్మకు బాగా గుర్తు. కొడుకు మొదటి జీతం తీసుకున్నరోజు ఆనందంగా ఇంటికి వచ్చి "అమ్మా! నీకేంకావాలో చెప్పు కొనిపెడతాను" అన్నప్పుడు అడగాలా, వద్దా అని తటపటాయిస్తూనే "వెండిమువ్వల పట్టీలు" అని గబుక్కున అనేసింది. కూతురు, కొడుకు ఇద్దరూ ముఖాలు చూసుకున్నారు. కూతురు "అమ్మా! నీకిప్పుడు మువ్వల పట్టీలు ఎందుకమ్మా! అయినా నువ్వెప్పుడూ పట్టీలు పెట్టుకోవుకదా!" అంది ఆశ్చ ర్యంగా.

సుభద్రమ్మకేమనాలో తెలియక "నా కోసం కాదే, నీకోసమే కావాలని అడుగుతున్నాను" అబద్ధం చెప్పింది.

"ఆ..నాకు తెలుసు. నువ్వట్లాంటి పని చేస్తావని. ఎంతసేపు మా గురించేకాని నీ గురించి ఆలోచించవు కదా" అని విసుక్కుని- "అన్నయ్యా! అమ్మ అలాగే అంటుంది కాని, చెవులకు మంచి రాళ్ళ కమ్మలు తీసుకురా" అంది. కొడుకు సంతోషంగా రాళ్ళకమ్మలు తీసుకొచ్చాడు. ఆరకంగా మరోసారి ఆమె కోరిక తీరకుండా పోయింది.

వరుడి గురించి, అతని మంచి చెడ్డల గురించి సుభద్రమ్మ పెద్దగా ఆలోచించలేకపోయింది. పిన్నివచ్చి "పెళ్ళిలో వాళ్ళు నీకు బోలెడు నగలు పెడతారే. నువ్వెంతయినా అదృష్ట వంతురాలివే" అంది. సుభద్రమ్మ గబుక్కున "పిన్నీ! వాళ్ళు నాకు వెండి మువ్వల పట్టీలు పెడతారా?" అని అడిగింది.

ఆ తర్వాత ఆమె తన వయసు పైబడుతోంది కనుక ఇంక మువ్వల పట్టీ లు పెట్టుకోవడం బాగుండదని, వాటిని మరిచిపోవడమే మంచిదని అనుకుంది. కోడలు పెట్టుకుంటే చూడాలనుకుంటే ఆమెకిష్టం ఉండదని కనీసం పెళ్ళిలో కూడా పెట్టుకోలేదు. మనుమరాలు మువ్వలపట్టీలు పెట్టుకోవడం ఫ్యాషన్ కాదంటుంది. అందుకే ఎవరి కాళ్ళకు పట్టీలు కనిపించినా ఆనందంగా చూస్తుంది.

బామ్మ చెప్పిన కథ విన్న సమీర కళ్ళలో సన్నటి నీటిపొర కమ్మింది. "బామ్మా! నీకున్న ఒక చిన్న కోరికను తండ్రి, భర్త, కొడుకు ఎవరూ తీర్చలేకపోయారు. నువ్వైనా గట్టిగా అడగవలసింది. ఎందుకు మొహమాటపడ్డావు" అంది.

సుభద్రమ్మ ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ సమీరే "బామ్మా! ఎల్లుండి నేను ఒక ఇంటర్వ్యూ అటెండ్ కావడానికి హైదరాబాద్ వెళ్తున్నాను. నేను సెలెక్ట్ అయితే నీకు తప్పకుండా మువ్వల పట్టీలు కొంటాను. నువ్వు పెట్టుకోవాలి. నేను చూడాలి" చిన్నపిల్లలా అంది.

సుభద్రమ్మ చిన్నగా నవ్వి "పిచ్చిపిల్లా! ఇప్పుడు నాకు పట్టీలెందుకే. నువ్వు మంచి ఉద్యోగం సంపాదించి, పెళ్ళి చేసుకొని పిల్లాపాపలతో హాయిగా ఉండవే. నాకదేచాలు" అని- "చాలా రాత్రయింది వెళ్ళి పడుకో" అంది. సమీర మౌనంగా లేచి వెళ్ళి పడుకుంది. కాని, బామ్మకు తప్పకుండా మువ్వలపట్టీలు కొనాలని నిర్ణయించుకొంది.

మర్నాడు ఇంటర్వ్యూకోసం సమీర హైదరాబాద్ వెళ్ళింది. ఉద్యోగంలో సెలెక్ట్ అయింది. జీతం ఎనిమిదివేలు. పది రోజుల తర్వాత వచ్చి జాయిన్ కమ్మన్నారు. సమీర ఆనందంతో బయటకు వచ్చి ఆటోకోసం చూస్తుంటే, "బాలాజీ జ్యువలరీస్" అని ఎదురుగా బోర్డు కనిపించడంతో "బామ్మకు మువ్వలపట్టీలు కొనాలి. ఆమె వద్దన్నా బలవంతంగానైనా కాళ్ళకు పెట్టాలి" అనుకొని షాపులోకి వెళ్ళింది. చాలాసేపు వెతికి తనకు కావలసిన మామిడిపిందెలు, మధ్యమధ్యలో మువ్వలతో ఉన్న పట్టీలు కొనుక్కొని వరంగల్ బయలుదేరింది.

సమీర కాజీపేట స్టేషన్‌లో దిగి ఆటోలో ఇంటికి వెళ్ళింది. ఇంటిముందు చాలామంది గుమికూడి ఉన్నారు. సమీర మనసు కీడు శంకించింది. తొందరగా ఆటోడ్రైవర్‌కి డబ్బులిచ్చి ఇంట్లోకి అడుగుపెట్టి, అక్కడి దృశ్యం చూసి బొమ్మలా చేతలుడిగి నిలుచుండిపోయింది. హాల్లో సుభద్రమ్మను చాప మీద పడుకోబెట్టారు. తలవైపు దీపం వెలుగుతూ ఉంది. తల్లి, తండ్రి, అత్తయ్య పక్కన కూర్చుని ఏడుస్తున్నారు. తల్లి ఆమెను చూడగానే "మీ బామ్మ మనను అన్యాయం చేసిపోయిందే తల్లీ" అంటూ బోరుమని ఏడ్చింది. ఎవరో అంటున్నారు "రాత్రికి రాత్రే గుండెపోటు వచ్చి నిద్రలోనే ప్రాణం పోయిందట. అదృష్టవంతురాలు సునాయాస మరణం" అని. సమీర ఈలోకంలోకి వచ్చి బామ్మ కాళ్ళపై పడి "బామ్మా! ఎంతపని చేశావు. అయ్యో! ఎంత ఘోరం జరిగింది, అని ఏడుస్తూ పాదాలు తడిమింది. ఆమెకు తాను కొన్న మువ్వలపట్టీలు గుర్తొచ్చాయి, బామ్మా! నీ కోసం నీకిష్టమైన మువ్వలపట్టీలు తెచ్చాను. లే బామ్మా! పెట్టుకో" అంటూ ఏడిచింది. తల్లి బిత్తరపోయి మెల్లిగా "ఆమె కు మువ్వలపట్టీలు తేవడమేంటే, పైగా పైకి చెప్తూ ఏడుస్తావేంటి, ఎవరైనా వింటే నవ్వుతారు. ఊరుకో" అని కసిరి "అత్తయ్యా! ఎంతపని చేశారు" అని మళ్ళీ ఏడుపు అందుకొంది. సమీరకు తల్లిని చూస్తే కోపంగా ఉంది. "ఏడుపులో కూడా హిపోక్రసీ ఉండాలా. ఇతరుల కోసమా ఏడ్చేది అని కోపంగా అనుకుంది. తల్లితో మెల్లిగా, "అమ్మా! ప్లీజ్. బామ్మ కాళ్ళకు పట్టీలు పెడతానే. కనీసం ఇప్పుడైనా ఆమె కోరిక తీరుస్తానే" దీనంగా అడిగింది. తల్లి "నీకేమైనా పిచ్చెక్కిందా! ఇప్పుడు నువ్వు పెట్టినా శవాన్ని కాల్చేప్పుడు ఒంటిమీద ఏమీ ఉంచరే. వాళ్ళే తీసేసుకుంటారు. అయినా అంద రూ నవ్వుతారంటే వినవేంటి" అని కసిరింది.

ఇంతలో సమీర మామయ్య, మరికొంతమంది వచ్చి హడావుడిగా, "జరగండి, జరగండి, ఇప్పటికే ఆలస్యమైపోయింది" అంటూ శవాన్ని పైకి లేపారు. "నన్ను క్షమించు బామ్మా! చివరకు నేను కూడా నీ కోరిక తీర్చలేకపోయాను" కన్నీళ్ళతో బామ్మ వైపు చూస్తూ అనుకుంది సమీర. ●